క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శులకు బయోమెట్రిక్ పరికరాల పంపిణీ



పంచాయతీ కార్యదర్శులకు బయోమెట్రిక్ పరికరాలు అందజేస్తున్న ఎంపీడీఓ బుజ్జి

గండేపల్లి: మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు బయోమెట్రిక్ పరికరాలు అందజేసినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధిదారులకు బయోమెట్రిక్ అథంటికేషన్ త్వరితగతిన పూర్తయ్యేందుకు ఈ పరికరాలు పంపిణీ చేశామన్నారు. వివిధ పథకాలు, సర్వేలకు వీటిని ఉపయోగించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె. చంద్రశేఖర్, ఏఓ చంద్రరావు, కార్యదర్శులు పీవీ శిరీష, తరంగిణి, షకీలా తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయం



పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న తాత్కాలిక చైర్‌పర్సన్ రూపాదేవి

తుని: వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయమని తాత్కాలిక మున్సిపల్ చైర్‌పర్సన్ కుచ్చర్లపాటి రూపాదేవి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో క్లబ్ ఉపాధ్యక్షుడు కె.డేనియల్ జోసెఫ్ సమకూర్చిన చీరలను మహిళా పారిశుధ్య కార్మికులకు రూపాదేవి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. అనంతరం తాత్కాలిక చైర్‌పర్సన్ రూపాదేవిని వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. క్లబ్ మాజీ గవర్నర్ చదరం శివాజీ, కుందెం సత్యనారాయణ, డీఎస్ మూర్తి, ప్రభావతి పాల్గొన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

శంఖవరం: మండలంలోని అంగన్‌వాడీ సిబ్బందికి పోషకాహారంపై గురువారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక ఎంఈఓ కార్యాలయంలో మిషన్ 2.0లో భాగంగా అంగన్‌వాడీలకు మూడు రోజులు పాటు శిక్షణ ఇస్తామన్నారు. బాలింతలు, గర్భిణులకు ఏవిధంగా పోషకాహారం అందించాలని, పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తారన్నారు. శిక్షణా తరగతులకు అంగన్‌వాడీలు తప్పకుండా హాజరవ్వాలని సూచించారు.

నేటి నుంచి శిక్షణ

ప్రత్తిపాడు రూరల్: ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్-బి, బడాయి-బీపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రత్తిపాడు ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి తెలిపారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం, మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఆశ్రమంలో మొక్క నాటుతున్న సంఘ అధ్యక్షుడు విజయబాబు, సభ్యులు

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు, వైద్యుడు ఎస్.విజయబాబు అన్నారు. పట్టణంలోని స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో సంఘ సభ్యుడు తాళ్లూరి గొల్లాజీరావు కుమారుడు కామేశ్వరరావు జ్ఞాపకార్థం బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు విజయబాబు మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణం కలుషితం కాకుండా నివారించవచ్చన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆశ్రమంలో పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు వరుపుల చిట్టిబాబు, పూర కృష్ణ, గొల్ల నాగేశ్వరరావు, వెల్లంపల్లి రాజా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజుబాబు

కిర్లంపూడి: బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా జగపతినగరం గ్రామానికి చెందిన శరకణం రాజుబాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా నాయకులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజుబాబుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గొంతెండుతోంది

- ధర్మవరంలో తాగునీటి సమస్య
- పైప్‌లైన్‌కు లీకులు
- తరచూ నిలిచిపోతున్న నీటి సరఫరా
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు వేసవి ప్రారంభంలోనే తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ధర్మవరంలో గత కొంత కాలంగా తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో తరచూ తాగునీటి సమస్య తలెత్తుతుంది. 2001 సంవత్సరంలో గ్రామంలో 1.50 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకాన్ని నిర్వహించారు. దీనికి జాతీయ రహదారికి అవతల వైపు బోరు కొట్టి, మోటర్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి వాటర్ ట్యాంకుకు, గ్రామంలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు సిమెంట్ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ఈ పైప్‌లైన్ వేసి 24 ఏళ్లు పూర్తికావడంతో శిథిలావస్థకు చేరుకుంది. గ్రామంలోని ఏదో ప్రాంతంలో తరచూ పైప్‌లైన్ మరమ్మతులకు గురై తాగునీరు లీకవుతోంది. దీంతో తాత్కలికంగా తాగునీటి సరఫరా నిలిచిపోతోంది. తాగునీటి సమస్య తలెత్తిన వెంటనే సమస్యను పరిష్కరించలేని పరిస్థితి స్థానికంగా నెలకొంది. ఇదే పరిస్థితి తరచూ పునరావృతం కావడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో రూ.66 లక్షలతో రక్షిత మంచినీటి పథకం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. 2022లో రూ.66 లక్షలతో 1.60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకానికి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్పట్లోనే దీనికి సంబంధించి వాటర్ ట్యాంకు నిర్మాణ పనులు పూర్తి చేశారు. అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వంలో దీనికి సంబంధించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే వెల్దుర్తి రోడ్డులో బోరు కొట్టి, మోటర్ కూడా వేశారు. పైప్‌లైన్ పనులు కనీసం ప్రారంభించలేదు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో చేపట్టిన ఈ పనులు పూర్తయితే ఇంటింటికీ తాగునీటి అందించి గ్రామంలో పూర్తిగా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.



శిథిలావస్థకు చేరడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్న వాటర్ పైప్‌లైన్

50 శాతం జనాభాకు తాగునీటి ఇక్కట్లు

మండలంలో ధర్మవరం అత్యధిక జనాభా కలిగిన గ్రామం. ఈ గ్రామంలో 20 వేల మంది ఉన్నారు. గ్రామస్తుల తాగునీటి అవసరాల నిమిత్తం జీఎల్ఆర్ ట్యాంకులు 64, చేతి బోర్లు 12 ఏర్పాటు చేశారు. వీటిలో 8 బోర్లు మరమ్మతులకు గురై నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామంలోని నంది బొమ్మ సెంటర్, సీతంపేట, పద్మశాలి వీధి, రామారావుపేట, కృష్ణుడి గుడి వీధి తదితర కాలనీల్లో 50 శాతం జనాభాకు తాగునీరు అందిస్తున్నారు. మిగిలిన ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న చేతి పంపు

శాశ్వత పరిష్కారం చూపాలి



గ్రామంలో తరచూ తాగునీటి సమస్య తలెత్తుతుంది. 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన పైప్‌లైన్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీంతో గ్రామంలోని ఏదో ప్రాంతంలో తాగునీరు లీకవుతోంది. తాత్కలికంగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– గొనగాని పద్మ, వార్డు సభ్యురాలు, ధర్మవరం



గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం

ఇప్పటికైనా అధికారులు స్పందించి జలజీవన్ పనులను వేగవంతం చేయడంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. గ్రామంలో తాగునీటి పైప్‌లైన్ శిథిలావస్థకు చేరుకుంది. ఈ పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరాకు అంతరాయ కలుగుతోంది. ప్రస్తుతం తలెత్తిన ఈ సమస్యను పరిష్కరించాం. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. జగనన్న కాలనీలోని వాటర్ ట్యాంకుకు నీటిని తరలించే నిమిత్తం వెల్దుర్తి రోడ్డులో మరో బోరు కొట్టి, మోటర్‌ను ఏర్పాటు చేస్తాం. దీని వల్ల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– ఎంవీఆర్ కుమార్ బాబు, ఎంపీడీఓ, ప్రత్తిపాడు

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ నేత దొరబాబు మృతి

- ఇంటి సమీపంలోనే ప్రమాదం
- సంతాపం వ్యక్తం చేసిన నాయకులు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కుసనం దొరబాబు (48) మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తాడేపల్లిగూడెం వెళ్లిన దొరబాబు తిరుగు ప్రయాణంలో రాత్రి 12.30 గంటలకు తుని రైల్వేస్టేషన్‌లో దిగారు. అక్కడ నుంచి ఇంటికి వస్తున్నట్టు ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు తెలిపారు. సమయం గడుస్తున్నా ఇంటికి రాకపోవడంతో బంధువులు ప్రధాన రహదారి మీదుగా రైల్వేస్టేషన్ వరకూ వెళ్లి వెతికినా కనిపించలేదు. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఎస్.అన్నవరంలో తన ఇంటికి రెండు వందల మీటర్ల దూరంలో రోడ్డుపై మోటార్ సైకిల్, కాలువలో పడిఉన్న వ్యక్తిని గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అప్పటికే దొరబాబు మృతి చెందారు. ఇంటి సమీపంలోనే దొరబాబు ప్రమాదానికి గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. రైల్వే స్టేషన్ నుంచి వస్తుండగా ఇంటి సమీప పక్కరోడ్డులో కుక్కలు వెంటబడడంతో ఆందోళన చెందిన దొరబాబు రోడ్డు పక్కన ఉన్న ఫైబర్ నెట్ స్తంభాన్ని ఢీకొని తీవ్రగాయాలతో మృతి చెందినట్టు భావిస్తున్నారు. కాగా పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఎస్.అన్నవరం తరలివచ్చి దొరబాబు పార్థివదేహాన్ని సందర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడికి తల్లి, భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.



కుసనం దొరబాబు (ఫైల్)

జగన్‌కు సన్నిహితుడిగా..

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితంగా దొరబాబు మెలిగాడు. 1998 నుంచి సంబంధాలు కలిగిన దొరబాబు 2007లో ఎస్.అన్నవరంలో వైఎస్ జగన్ యూత్‌ను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ స్థాపించిన మొదట రోజుల్లో జెండా పట్టిన వ్యక్తుల్లో దొరబాబు ఒకరు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగాను, ముఖ్యమంత్రిగాను తునికి వస్తే ఎంత దూరంలో ఉన్నా దొరబాబును పలకరించేవారు. జిల్లాలోని పలువురు నాయకులకు దొరబాబు సుపరిచితుడు. 2021లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో దొరబాబు తన భార్యను ఎస్.అన్నవరం ఎంపీటీసీగా గెలిపించుకున్నారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనే దొరబాబు మృతి పార్టీకి తీరని లోటు అని పలువురు నాయకులు పేర్కొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. మండలంలోని పెద్దిపాలెంలో సారా తరలిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు దాడి చేయడంతో సారా వదిలిపెట్టి ఇద్దరు నిందితులు పరారయ్యారు. సంఘటన స్థలం నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. పరారైన ఉత్తరకంచి గ్రామానికి చెందిన బస్వా సతీష్, పెద్దిపాలెం గ్రామానికి చెందిన చిన్ని ప్రసాద్‌లపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. కాగా మండలంలోని లంపకలోవ, పెదశంకర్లపూడి గ్రామాల్లోని సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన 4,600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బందితో పాటు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన 'ప్రో కార్టింగ్' చాంపియన్‌షిప్ పోటీలు



ఆదిత్యలో జరుగుతున్న ప్రో కార్టింగ్ పోటీలు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగిన ఆదిత్య ప్రో కార్టింగ్ ఎండురన్స్ చాంపియన్ షిప్-2025 పోటీలు బుధవారంతో ముగిసినట్టు యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎన్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఏపీలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు తమిళనాడు రాష్ట్రం నుంచి 13 టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. చివరిరోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకూ ఫైనల్స్ హోరాహోరీగా సాగాయి. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను విశాఖ రఘు ఇంజినీరింగ్ కళాశాల కైవసం చేసుకోగా, రన్నరప్‌గా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాల కైవసం చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ అకడమిక్స్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ రమాశ్రీ, జి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.


మండలంలో పీ4 సర్వే పూర్తి

తుని రూరల్: మండలంలో ప్రైవేట్, పబ్లిక్, ప్రజాభాగస్వామ్యం (పీ4) సర్వే పూర్తయ్యిందని ఎంపీడీఓ కె.సాయినవీన్ బుధవారం తెలిపారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది సహకారంతో నిర్దేశిత గడువులోగా 100 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. మండలంలో 27 సచివాలయాల పరిధిలోని 25613 గృహ సముదాయాల్లో సర్వే నిర్వహించినట్టు తెలిపారు. 23814 మంది (93 శాతం) సర్వేకు సహకరించారన్నారు. సర్వేలో నమోదైన పేర్లను ధ్రువీకరించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఉగాది తర్వాత గ్రామ సభలు నిర్వహించి పీ4 సర్వేను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.

పీ4 అభిప్రాయ సేకరణకు రేపటి నుంచి గ్రామ సభలు

తుని రూరల్: పీ4పై అభిప్రాయ సేకరణకు ఈ నెల 21 నుంచి 24 వరకూ గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.సాయినవీన్ బుధవారం తెలిపారు. ఈ నెల 21న అటికెవానిపాలెం, చామవరం, వల్లూరు, దొండవాక, కేఓ మల్లవరం, కొలిమేరు, కొత్తూరు, కుమ్మరిలోవ, 22న ఎన్.సూరవరం. రాపాక, హంసవరం, రేఖవానిపాలెం, ఎస్.అన్నవరం, తాళ్లూరు, తేటగుంట, 24న చేపూరు, తిమ్మాపురం, ఎన్ఎస్‌వీ నగరం, రాజుపేట, లోవకొత్తూరు, హెచ్.కొత్తూరు, డి.పోలవరం, అగ్రహారం గ్రామాల్లో సభలు జరుగుతాయని వివరించారు.

సైకిల్ యాత్ర పునః ప్రారంభం



రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు

అన్నవరం: దేశ భద్రత, సమైక్యత ఆవశ్యకతను చాటి చెబుతూ సమృద్ సంరక్షణ పేరుతో పశ్చిమ బెంగాల్‌లోని బక్కాహలి నుంచి కన్యాకుమారి వరకు కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) చేస్తున్న సైకిల్ యాత్ర బుధవారం రత్నగిరిపై పునః ప్రారంభమైంది. ఈ యాత్ర మంగళవారం రాత్రి అన్నవరం చేరిన విషయం విదితమే. రాత్రి అన్నవరంలో బస చేసిన సీఐఎస్ఎఫ్ సైకిల్ యాత్రికులు బుధవారం ఉదయం సత్యదేవుని దర్శించి యాత్రను పునః ప్రారంభించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు జెండా ఊపి యాత్రకు ప్రారంభించారు. 60 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బంది సుమారు 2,700 కిలోమీటర్ల మేర ఈ యాత్ర చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎస్.కుమార్‌రాజా, ఎస్ఐ శ్రీహరి బాబు, విశ్రాంత ఆర్ఐ ప్రసాద్, సూపరింటిండెంట్ ఐవీ రామారావు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 12 మంది గైర్హాజరు

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి, ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కాగా బుధవారం పరీక్షలకు 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ-2 గాడి కొండబాబు తెలిపారు. మొత్తం 580 మంది రెగ్యులర్ విద్యార్థులకు నలుగురు, పది మంది కంపార్టుమెంట్ విద్యార్థులకు ఎనిమిది మంది గైర్హాజరైనట్టు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్నిరకాల వసతులు కల్పించారు.

ప్రత్తిపాడు మండలంలో 13 మంది గైర్హాజరు

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: మండలంలో రెండో రోజు బుధవారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని లంపకలోవ పరీక్ష కేంద్రంలో 244 మందికి 236 మంది, ప్రత్తిపాడు పరీక్ష కేంద్రంలో 190 మందికి 188 మంది, ఒమ్మంగి ఎ కేంద్రంలో 200 మందికి 199 మంది, ఒమ్మంగి బి కేంద్రంలో 95 మందికి 95 మంది, ధర్మవరం పరీక్ష కేంద్రంలో 125 మందికి 123 మంది వెరసి 854 మందికి 841 మంది పరీక్షకు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేశారు. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్తిపాడు సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్సై లక్ష్మీ డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు.



ధర్మవరం పాఠశాలలో డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టిన పోలీసు అధికారులు

హిందీ పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు

గోకవరం: మండలంలో బుధవారం జరిగిన పదో తరగతి హిందీ పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. గోకవరం, కామరాజుపేట, రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లు, భూపతిపాలెం బాలుర గురుకుల పాఠశాల, వీరలంకపల్లి బాలికల గురుకుల పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. హిందీ పరీక్షకు 743 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 736 మంది హాజరైనట్టు ఎంఈఓ బి.గౌరమ్మ తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పారిశుధ్య బాధ్యతలు ఏఈఓలకు అప్పగింత

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్థానిక శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో గల వివిధ సత్రాల్లో పారిశుధ్యం (శానిటేషన్) నిర్వహణ బాధ్యతలను ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల (ఏఈఓ)లకు అప్పగించారు. ఈ మేరకు ఈఓ వీర్ల సుబ్బారావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 13వ తేదీన విజయవాడలో దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఏఈఓలకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

బాధ్యతలు ఇలా...

సత్యగిరిపై గల శివసదన్ సత్రానికి ఏఈఓ భ్రమరాంబ, హరిహరసదన్ సత్రానికి ఏఈఓ పి.జగ్గారావు, విష్ణుసదన్, న్యూ సెంటినరీ సత్రాలకు ఏఈఓ కేవీఊ రెకె కొండలరావు, ప్రకాష్‌సదన్ సత్రానికి డీవీఎస్ కృష్ణారావు, ఓల్డ్ సెంటినరీ సత్రానికి ఏఈఓ వేంకటరెడ్డి, సీతారామ సత్రానికి ఎల్.శ్రీనివాసరావు, సత్యనికేతన్ సత్రం బాధ్యతలను సూపరింటిండెంట్ ఐవీ రామారావులకు అప్పగించారు. సత్రాల్లో మరమ్మతులు, పెయింటింగ్స్, ఫర్నిచర్ తదితర విషయాల్లో పూర్తి బాధ్యతలను ఏఈఓలు నిర్వహిస్తారు. అలాగే సత్రాల్లో విద్యుత్ పరికరాలు, వాటర్ వర్క్స్ పనులను డీఈ సత్యనారాయణ పర్యవేక్షణలో ఏఈ కేవీఎస్ చౌదరి, ఎం.గుర్రయ్య నిర్వహించాలని ఆదేశించారు. ఏఈఓలకు అప్పగించిన పారిశుధ్య బాధ్యతల పర్యవేక్షణను ఈఈ వి.నూకరత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లకు అప్పగించారు.



రత్నగిరిపై సీతారామ సత్రం

సోమన్నదొరకు ముద్రగడ పరామర్శ



ధర్మవరంలో సోమన్నదొరను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరానికి చెందిన సాంస్కృతిక కళాకారుడు దొడ్డిపట్ల సోమన్నదొరను బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. సోమన్నదొర ఇటీవల గుండె సంబంధిత సమస్యకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. గిరిబాబు ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్టు తెలిపారు. ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఎంపీపీ గొల్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, సొసైటీ మాజీ చైర్మన్లు జువ్వల బాబులు, జువ్వల చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

తుని రూరల్: మండలంలో ఆస్తి పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. బృందాలుగా ఏర్పడి వసూళ్లను ముమ్మరం చేశారు. రాపాక పంచాయతీలో వందశాతం పన్నులు వసూళ్లు చేశారు. ఈ గ్రామంలో రూ.1,29,054 డిమాండ్ ఉండగా మొత్తం వసూలు చేసినట్టు ఈఓపీఆర్డీ జి.మరిడియ్య బుధవారం తెలిపారు. ఎస్.అన్నవరం మేజరు పంచాయతీలో కార్యదర్శి ఎం.వీరలక్ష్మి ఆధ్వర్యంలో 68.85 లక్షలకుగాను రూ.38 లక్షలు వసూలు చేశారు. మండలంలో మొత్తంగా రూ.2.29 కోట్లకు గాను రూ.1.18 కోట్లు వసూళ్లు చేసినట్టు తెలిపారు. ఈ నెలాఖరుకు 80 నుంచి 90 శాతం వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నట్టు పేర్కొన్నారు. ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.



ఎస్.అన్నవరం మేజరు పంచాయతీలో ఆస్తి పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి వీరలక్ష్మి, సిబ్బంది

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన

జగ్గంపేట: ఎస్సీ వర్గీకరణ నివేదికను రద్దు చేయాలని జగ్గంపేట నియోజకవర్గ మాల ఉపకులాల నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుక నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఏకసభ్య రాజీవ్ రంజన్ మిశ్రా కమీషన్ 2011 జనాభా లెక్కల ప్రకారం నివేదికను తయారు చేయడం దుర్మార్గమన్నారు. రాజీవ్ రంజాన్ మిశ్రా కమిటీని వెంటనే రద్దు చేయాలని, లేకుంటే మండలాలు, జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నీలపల్లి అప్పారావు, మద్రి పృథ్వీరాజ్, సలాది డేవిడ్, ఎస్.అప్పారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

265 మందికి దంత పరీక్షలు

గండేపల్లి: మండలంలోని మురారిలో జీఎస్ఎల్ దంత వైద్యశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ప్రారంభించారు. గ్రామస్తులకు ఉచితంగా దంత, కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 265 మందికి దంత పరీక్షలు, 210 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్టు ఎన్ఎస్ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణరాజు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీవీ శిరీష, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

గోకవరం: యువతి అదృశ్యంపై గోకవరం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరానికి చెందిన యువతి గోకవరంలోని తన అక్క ఇంటికి వచ్చి ఈ నెల 15న తిరిగి సీతానగరం బయలుదేరి వెళ్లింది. కానీ ఇంటికి చేరకపోవడంతో తెలిసిన వారు, బంధువుల ఇంటి వద్ద కుటుంబ సభ్యులు గాలించారు. అయినప్పటికీ యువతి ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అన్నసమారాధన

ప్రత్తిపాడు: స్థానిక సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఏటా కంఠస్ఫూర్తి వంశీయుల ఆధ్వర్యంలో అమ్మవారి జాతర మహోత్సవం ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఈ ఏడాది అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోక్సో చట్టంపై అవగాహన

కిర్లంపూడి: పోక్సో చట్టంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పడాల చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఎస్.వేదకుమారి అధ్యక్షతన బుధవారం పోక్సో చట్టంపై వీఓ లీడర్స్, వీఓఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, ఇంటర్‌నెట్ రూల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ హెచ్‌డీ యాంకర్ పర్సన్ జి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.